

## అధిక వడ్డీకి ఆశపడి మోసపోయారు?

వార్తలు చివరి పేజీలో




## 'డ్రాప్ బాక్స్' రూల్స్ కఠినతరం..



ఇండియా టెక్స్‌టైల్ ఎక్స్‌పోలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మన రాష్ట్ర స్టాల్‌ను కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రి గురురాజ్ సింగ్, రాష్ట్ర హ్యాండ్లూమ్స్ & టెక్స్‌టైల్స్ కమిషనర్ రేఖారాణిలతో కలిసి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. న్యూఢిల్లీలోని భారత్‌మండపంలో జరుగుతున్న 'ఇండియా టెక్స్‌టైల్ ఎక్స్‌పో'లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగ అభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్‌ను వీరు ప్రారంభించారు.

**- సత్యంన్యూస్, న్యూఢిల్లీ**


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 14-2-2025

సంపుటి: 20 సంచిక: 274

పేజీలు: 8 వెల: రూ.1





# పోయాం మోసం..!



> **ఇదేదో సినిమాలో విన్న డైలాగులా ఉంది కదా.. కాదు జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాలు వచ్చాక కార్పోరేట్ కాలేజీల్లో వారి పిల్లల్ని చేర్పించిన తల్లిదండ్రులు జపిస్తున్న మంత్రం. 'మీ పిల్లల్ని మా దగ్గర జాయిన్ చేయండి.. ఐఐటికి పంపండి..' అన్న నినాదంతో లక్షల సంఖ్యలో పిల్లల్ని జాయిన్ చేసుకున్న కాలేజీలు ఇప్పుడు 'మీ పిల్లల్లో ఆ సామర్థ్యం లేకపోతే మేమేం చేయగలం' అని చేతులెత్తేస్తున్నాయి.**

ఇంటర్ రెండేళ్లలో లక్షల్లో ఫీజు వసూలుచేసిన కార్పోరేట్ కాలేజీలు ఈ ఏడాది కనీస ప్రతిభ కనబరచిన దాఖలాలు లేవు. తమ పిల్లల ఫలితాల గురించి ప్రశ్నించిన తల్లిదండ్రులకు ఏప్రిల్ సెషన్ ఇంకొకటి ఉందని ఆశ చూపిస్తున్నాయి. వాస్తవానికి ఏప్రిల్ సెషన్‌లో విద్యార్థులు రాయబోయే పరీక్షల్లో పెద్దగా మార్కులు వ్యత్యాసం కనబడదు. అనేక మంది విద్యార్థులకు జనవరి సెషన్‌లో కంటే ఏప్రిల్ సెషన్‌లో మార్కులు తక్కువ వస్తుంటాయి. దీనికి కారణం లేకపోలేదు. ఒకసారి జనవరి సెషన్‌లో ఫలితాలు వచ్చాక విద్యార్థి రిలాక్స్ అయిపోతాడు. ఇదే తన సామర్థ్యం అని తమ తల్లి దండ్రులకు తెలిసేలా చేసేసి ఉంటాడు కాబట్టి పెద్దగా శ్రద్ధ కనబరచడు. అప్పటికే ఆ తల్లిదండ్రులు సదరు విద్యార్థిని ఎక్కడ జాయిన్ చేయాలో రకరకాలుగా ప్రయత్నాలు చేస్తుంటారు. అనేక ప్రైవేటు యూనివర్సిటీల గురించి వాకబు చేస్తారు. ఇది పిల్లలు గ్రహిస్తారు. ఇదే వారి అశ్రద్ధకు దారి తీస్తుంది. గతంలో మనం అనేక సందర్భాల్లో చెప్పినట్టు పదో తరగతి వరకు స్టేట్ సిలబస్ చదివిన విద్యార్థి జాతీయ స్థాయి పరీక్షలైన మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ తరహా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం కష్టం. ఇంటర్ రెండేళ్లలో స్టేట్ బోర్డు పరీక్షలకు సన్నద్ధం అవుతూ ఎన్‌సిఆర్‌టీ ప్రిపేర్ అవడం అంత సులభతరం కాదు. ఇది చాలా కొద్ది మందికే సాధ్యపడుతుంది. ఇది కాలేజీ వాళ్లు చెప్పరు, దీన్ని అర్థం చేసుకోగల స్థితిలో తల్లిదండ్రులు ఉండరు. వీధిలో ఎవరికో వచ్చిందని, పేపర్లలో ఒకరిద్దరు ఫోటోలు చూసి తమ పిల్లలు ఆ స్థాయిలో ఉండాలని కోరుకుంటారు. దాంట్లో తప్పు కూడా లేదు. కానీ పిల్లల మేధస్సు అర్థం చేసుకోకుండా లక్ష్యాలు నిర్దేశించడం సరికాదు. సరిగ్గా ఇక్కడే కార్పొరేట్ కాలేజీల వారు తల్లిదండ్రుల బలహీనత గ్రహించి లాంగ్ టర్మ్‌కు ఉసిగొల్పుతారు. లాంగ్ టర్మ్‌లో సక్సెస్ రేట్ 10 లేదా 20 శాతానికి మించదు. ఇది తల్లి దండ్రులు అర్థం చేసుకోవాలి. ఈ ఏడాది సుమారు 12.50 లక్షల మంది విద్యార్థులు మెయిన్స్ పరీక్షలు రాశారు. ఇక సీట్ల విషయానికి వస్తే దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీల్లో 17,740, ఎన్ఐటీలలో 24,229, ట్రిపుల్ ఐటీల్లో సుమారు 8,500 సీట్లు ఉన్నాయి. అంటే అన్ని కలుపుకుని 50వేల సీట్లు. వీటిలో మన పిల్లలకు సీట్లు రావాలి. ఇలాంటి ఆట మనం వారితో ఆడిస్తున్నాం. ఐఐటి, ఎన్ఐటిలలో సీటు వచ్చినంత మాత్రాన పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అర్థం కాదు. వాటిల్లో గత కొద్ది కాలంగా ఉద్యోగావకాశాలు శాతం గణనీయంగా తగ్గుతుండడం చూస్తున్నాం. ఈ సమయంలో తల్లిదండ్రులు పిల్లలకు ధైర్యం చెప్పాలి, వారిని అర్థం చేసుకునేలా మాట్లాడాలి. సాధారణంగా కార్పోరేట్ కాలేజీల్లో మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షలు మినహా మరో పరీక్షకు పిల్లల్ని సిద్ధం చేయరు. వీటికి ప్రత్యామ్నాయంగా అనేక పరీక్షలు ఉన్నాయని మనమే తెలియజేయాలి. వీలైతే సంబంధిత నిపుణులతో మాట్లాడండి. మీ పిల్లల అలవాట్లు, చదువుపై వారికున్న శ్రద్ధ, లక్ష్యాలు వారికి తెలియజేయండి. మీకు అనేక వర్సిటీల వివరాలు వారే తెలియజేస్తారు.

**- సీహెచ్ దుర్గాప్రసాద్**

## అచ్చెన్న ఆదేశాల

# ఫైల్ మాయం!



- బీసీ స్టడీ సర్కిల్ తరలింపుపై మీనమేషాలు
- కొత్త భవనంలోకి మార్చడానికి ససేమిరా
- వైటీసీలో శిక్షణ.. అరకొర వసతులతో అభ్యసన
- ఉన్నదానికి దిక్కులేదు.. 10 ఎకరాల్లో డిజిటల్ లైబ్రరీ పెడతారట
- మండిపడుతున్న బీసీ సంఘాలు



- వివరాలు చివరి పేజీలో

# ఈ జగమంతా ప్రేమమయం..!

(ప్రేమను నిర్వచించే మాటలుంటే ఆ మాటలకు పూర్తిగా ప్రేమ గురించి తెలిసి ఉంటుందా? అయినా ప్రేమను నిర్వచించకుండా లోకం ఊరుకుంటుందా? అలా మాటలకు అందీ అందని ప్రేమను తన మాటల్లో కవితాత్మకంగా బంధించారు కిలపర్తి త్రినాథ్. ఆయన ఒకప్పుడు వైమానికదళంలో సైనికుడు. ప్రస్తుతం విశాఖలో బ్యాంక్ ఉద్యోగి. రచన ప్రవృత్తి)

ప్రేమ.. ఎంత చిన్న పదం! ఎంత పెద్ద భావం! ఎంతమంది ఎన్ని యుగాల నుంచి ఆ జాజిపూల వానలో తడిసి ముద్దయిపోయుంటారు? ఎంత మంది ఆ రంగు కలల్లో మెరిసి ముగ్గయిపోయుంటారు? ఎంతమంది ప్రేమను పొందక బతుకు పోరల్లో బుగ్గయిపోయుంటారు? అంతా ప్రేమే. ఈ సృష్టికి మూలం ప్రేమే. మనిషికి అందం ప్రేమే. ఎన్నిరకాల ప్రేమలో ఈలోకంలో!

తొలి పొద్దు సూరీడు మెల్లగా లోకాన్ని నిద్ర లేపడం ప్రేమ.. తొలకరిన చిరుజల్లు చిరునవ్వు నవ్వడం ప్రేమ.. హేమంత కాలాన చేమంతి వెన్నెలలు ప్రేమ.. సంక్రాంతి సమయాన నునువెచ్చటి నవ్వులు ప్రేమ..

అసలు ఈ పదానికి అర్థం చెప్పటానికి ఎంతమంది కవులు ఎన్ని రకాలుగా ప్రయత్నించి ఉంటారు.. ఎన్ని భాషల్లో ఎన్ని భావాల్లో వర్ణించి ఉంటారు..?! అయినా అది అసంపూర్ణమై, ఇంకా ఎంతైనా ఎలా అయినా చెప్పగలిగేంత గొప్పతనం ఉన్న ఓ బ్రహ్మ పదార్థం ప్రేమ.

**అంతవరకూ ఎవరో తెలియని మనిషి ఇకపై మనదనుకుంటూ ఇష్టం పెంచుకోవడం ప్రేమ.. గుండెలపై వేలాడే ఓ పసుపు కొమ్ము ప్రేమ.. పది నెలల తర్వాత ఓ వెచ్చని తొలి కేక ప్రేమ.. పొత్తిలిలో ఓ మెత్తని స్పర్శ ప్రేమ.. అక్క చేయి అపురూపంగా పట్టుకొని వేసే అడుగులు ప్రేమ.. తమ్ముడి తప్పులను తిడుతూ దిద్దడం ప్రేమ.. అలిసి వచ్చిన నాన్నకు అందించిన చల్లటి మంచినీటి గ్లాసు ప్రేమ.. సరదా సమయంలో స్నేహితుడి చిరునవ్వు ప్రేమ.. కష్టకాలంలో ఇష్టంగా భుజాన వేసిన చేయి ప్రేమ.. ఓ అసహాయ కొమ్మకు ఆసరా ఇచ్చిన సాయం ప్రేమ.. మలివయసులో బతుకు జ్ఞాపకాల దొంతర ప్రేమ..**

ఈ జగమంతా ప్రేమే. కాకపోతే కాస్త స్పందించే హృదయం ఉండాలి. అందుకే ఓ బాలసుబ్రహ్మణ్యం గళం ప్రేమ.. ఓ వేటూరి కలం ప్రేమ.. ఓ ఇళయరాజా స్వరం ప్రేమ.. ఓ బాపు కుంచె దిద్దిన రంగుల చిత్రం ప్రేమ.

కలిసున్నా లేకపోయినా చిరుగాలిలాంటి చిరునవ్వునూ.. తెరచాప లాంటి పరువాన్నీ.. ఈ జన్మకే కాదు, వచ్చే జన్మకూ కలిసే కోరుకున్న ఇద్దరి మూగమనసుల నావ.. గోదారి గుండె సుడిగుండంలో మునగడం ప్రేమ. తన నుదుటి పసుపు, కలల కుంకుమ మాయమైపోయినా అప్పదాసు తనకంటే ముందే పోవాలి.. లేదంటే తను ఈ లోకంలో హాయిగా బతకలేదని బుచ్చమ్మ అనుకోవడం ప్రేమ. (మిథునం సినిమాలో)

పున్నమినాటికి స్వర్గపు ద్వారాలు మూసుకుపోనీ.. ఇంద్రుడి ఇంట అన్ని సుఖాలూ దూరమైపోనీ.. ఈ జగదేక వీరుడి చెంత ఏ చింతా లేదు అనుకుంటూ మహిమాంగుళీయకాన్ని సంద్రంలోకి ఇంద్రజ విసిరేయడం ప్రేమ. వయసుతో సంబంధం లేకుండా ఇష్టమైన వారిని ప్రేమగా టుమ్రీ! బుడ్డీ! కన్నా! అని పిలుచుకోవడం ప్రేమ. ఎక్కడో ఏ యుద్ధంలోనో చనిపోయిన ఓ చిన్నారి మరణానికై రాలిన మన కన్నీటి బొట్టు ప్రేమ. ఇష్టమైనవారు కాస్త దూరమైతే ఎంత తీయని ఇళయరాజా పాటయినా ఆనందం ఇవ్వకపోవడం ప్రేమ.

**- కిలపర్తి త్రినాథ్**



# వీరందరికీ ప్రేమికులరోజు శుభాకాంక్షలు

* 'నాకు ప్రేమించడం ఇష్టం. మా కులం వాళ్లను ప్రేమించడం ఇంకా ఇంకా ఇష్టం' అనేవాళ్లకి.. * 'నిన్ను ప్రేమిస్తాను.. కానీ పెళ్లి గురించి గ్యారెంటీ ఇవ్వలేను' అని చెప్పే అమ్మాయిలకీ, అబ్బాయిలకీ.. * 'ప్రేమ ఓకే, కానీ ఉద్యోగం వస్తేనే నీతో పెళ్లి' అని కండీషన్ పెట్టే అమ్మాయిలకీ.. * 'మనది ప్రేమ పెళ్లే కానీ, మా వాళ్లకు మాత్రం కట్నం కావాలి' అని చెప్పే అబ్బాయిలకీ.. * 'ప్రేమిస్తావా, లేక పెట్రోల్ పోసి చంపేయమంటావా? కాదంటే యాసిడ్ పోయానా?' అని అమ్మాయిలకు చావుపై ఆప్షన్లు ఇచ్చే సైకోలకూ.. (ప్రేమికుల రోజునే అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలో ప్యారెంపల్లెకు చెందిన 23 ఏళ్ల యువతిపై యాసిడ్ పోసి అత్యాచారం జరిపిన ఘటన వెలుగుచూసింది) * 'మన ప్రేమ గురించి మా ఇంట్లో చెప్తాను. మా వాళ్లు అడిగితే సేమ్ క్యాస్ట్ అని చెప్పు' అని ముందుగా హెచ్చరించే అమ్మాయిలకీ.. * 'మా దేవుణ్ని నమ్మి మా మతంలోకి వస్తేనే మన పెళ్లి' అని కండీషన్ పెట్టే పరమ పరలోక భక్తులకీ.. 'మా మతంలోకి వచ్చి బొట్టు పెట్టుకుంటేనే మనం కలిసుంటాం' అని బెదిరించే వీరధర్మ పిల్లిపులులకూ.. * 'మా క్యాస్ట్‌లో ప్రేమ పెళ్లిళ్లు ఒప్పుకోరు' అని బుద్ధిగా, పద్ధతిగా చెప్పే అమ్మాయిలకీ, అయినా వాళ్ల వెంటపడే అబ్బాయిలకీ.. * 'మా ఇంట్లో మన లవ్‌ని ఒప్పుకోవాలంటే నీకు గవర్నమెంట్ జాబ్ ఉండాలి' అని కోరే అమ్మాయిలకీ, వాళ్ల కోసం అశోక్‌నగర్‌కి, దిల్‌సుఖ్ నగర్‌లకీ అంకితమైన అబ్బాయిలకీ.. * 'ప్రేమలో ఎలా ఉన్నా ఓకే, కానీ పెళ్లయ్యాక కొంచెం పద్ధతిగా ఉండు' అని హెచ్చరికలు జారీ చేసే అబ్బాయిలకీ.. * 'ఇప్పుడు మనకు పెళ్లయ్యింది. ముందులా ఉండాలంటే కుదరదు' అని చెప్పే మొగుళ్లకీ, వాళ్ల మాటలకు తలూపే పెళ్లాలకీ.. * 'ప్రేమించడానికి వాడే దొరికాడా, మన కులంలో ఎవరూ దొరకలేదా' అని నిలదీసే అమ్మానాన్నలకీ, తమ కులంలోనే ప్రేమికుల్ని వెతుక్కోవాలనే ఆలోచన రాని యువతకీ.. * 'ప్రేమాదోమా అంటే కాళ్లు విరగ్గొడతా! నోర్మూసుకుని తాళి కట్టించుకో' అంటూ ఆడపిల్లల్ని బలిపశువుల్ని చేసే తల్లిదండ్రులకీ, ఆ అమ్మాయి తనకోసమే పుట్టిందనుకొని తాళి కట్టే పెళ్లి కొడుకులకీ.. * పెళ్లికి ముందు భార్య మరెవర్నో ప్రేమించదని తెలిసి, పుట్టిన కొడుకులో తన పోలిక లున్నాయా, లేదా అని వెతికే ప్రబుద్ధ భర్తలకీ, వారితో నిత్యనరకం అనుభవిస్తున్న భార్యలకీ.. * కొడుకు ప్రేమ పెళ్లి చేసుకున్నా కోడలి నుంచి కట్నం అడిగి, కూతురు ప్రేమ పెళ్లికి మాత్రం కట్నమెందుకు అని నోళ్లు నొక్కుకునే ఆదర్శ అమ్మానాన్నలకీ, వాళ్ల పిల్లలకీ.. * కొడుకు ప్రేమిస్తే 'ఆ అమ్మాయి మా వాణ్ని బుట్టలో వేసుకుందని' నమ్మి, కూతురు ప్రేమిస్తే మాత్రం 'వాడెవడో మా పిల్లను వల్లో వేసుకున్నాడు' అని చాటుకునే ప్రియమైన తల్లులకూ.. * తమ కూతుళ్లు వేరే కులం అబ్బాయిల వైపు చూడకుండా బాడీగార్డులు ఏర్పాటుచేసే తండ్రులకి, వారి మద్దతు పలికే తల్లులకీ.. * 'మీ పిల్లలు లవ్ మ్యారేజీ చేసుకున్నారంటగా' అని గుచ్చిగుచ్చి అడిగే బంధువులకీ, ఆరాలు తీసే



ఇరుగుపొరుగువారికీ.. * కూతురు వేరే కులం వాణ్ని, అందునా తమకంటే తక్కువ అని భావించే కులం వారిని ప్రేమించిందంటే, వెంటనే కత్తులకు సాన పెట్టే తండ్రులకూ, ఆ కత్తిని పిడికిట పట్టే కొడుకులకీ, వాళ్లని ఎగదోసే నానమ్మలకీ.. * కులం కోసం కత్తులు పట్టిన, పట్టించిన మనోహరాచారి, మారుతీరావు.. తదితర ప్రముఖోత్తములకూ, వారికి మద్దతు ఇచ్చే 'కులగులా కారులకూ'.. * 'ప్రేమించుకుంటూ టిఫిన్లు లేకపోతే ఎట్లా'.. అని కోడ్ భాష మొదలుపెట్టి మొదట ముద్దుల్ని, ఆ తర్వాత రగ్గుల్ని పంచుకుని ప్రేమకు కొత్త నిర్వచనం చెప్పే ప్రేయసీ ప్రియులకీ.. * 'ఎవ్వరు ఏమన్నా ఆగదు ఈ ప్రేమ' అని పాటలు పాడుకుంటూ ఇంట్లోంచి పారిపోయే 14 ఏళ్ల అమ్మాయిలకీ, 17 ఏళ్ల అబ్బాయి లకీ, వారి వీరప్రేమగాథకీ.. * 'ప్రేమికుడు తోడుంటే స్వర్గానికైనా వెళ్లొచ్చు' అనే సినిమా డైలాగులు నమ్మి, వారి వెంట వెళ్లి చివరకు ముంబయి కామాటిపురలో తేలే అమ్మాయిలకీ, వారి కన్నీటిగాథలకీ.. * 16 ఏళ్ల వయసులో 20 ఏళ్ల వాడిలో ప్రేమలో మునిగి, వాణ్నే కట్టుకొని, రెండేళ్లకే ఇద్దరు బిడ్డలకు తల్లై, 22 ఏళ్ల మొగుడి అలసత్వం, బద్ధకం భరించలేక అవస్థ పడుతున్న 18 ఏళ్ల ముత్తయిదువులకీ, వారికి పుట్టిన అమాయకపు పిల్లలకీ.. * అమ్మాయిని ప్రేమిస్తున్నానని చెప్పగానే, 'ఆహా! అయితే బంచిక్ బంబం అన్నమాట' అంటూ సెక్స్ గురించి ఆలోచించే అబ్బాయి ఫ్రెండ్స్‌కి, వారి ఊహలకీ, వారి మెచ్యూరిటీకి..* అబ్బాయిని ప్రేమిస్తున్నాని చెప్పగానే, 'ఏజ్, సాలరీ, కులం, ఆస్తిపాస్తులు.. ఫైనల్లీ అందంగా ఉన్నాడా' అని ఆరాలు తీసే అమ్మాయి ఫ్రెండ్స్‌కీ, వారి ఆలోచనలకీ, వారి ఆశలకీ.. * భర్త/భార్య మీద శారీరక ప్రేమని, ప్రియుడు/ప్రియురాలి మీద మానసిక ప్రేమను గుమ్మరించగలిగే 'వీర ప్రేమికులకీ'.. * 'ఇతర మతాల అమ్మాయిల్ని ప్రేమించు, పెళ్లి చేసుకుని మన మతంలోకి మార్చు' అని సిద్ధాంతాలు గ్రంథస్తం చేసే మతపెద్దలకీ, వారికి మద్దతు పలికే అమాయక యువతకీ, వారిని హాయిగా వాడుకునే రాజకీయ నాయకులకీ.. * విదేశీ అమ్మాయిలు భారతీయులను ప్రేమించి పెళ్లి చేసుకుంటే ఇవాళ గొప్పగా పొగిడి, 60 ఏళ్ల క్రితం అదే పని చేసిన సోనియాగాంధీని మాత్రం 'గొర్రె, మరక, క్రిస్టియన్ దూత' అని ఆడిపోసుకునే సోషల్‌మీడియా సోకాల్డ్ ధర్మపరిరక్షకులకు.. * అద్భుతమైన ప్రేమకథలు సినిమాలుగా తీసి, తమ పిల్లలు ప్రేమ పెళ్లిళ్లు చేసుకుంటానంటే మాత్రం అడ్డుపుల్లలు వేసే సృజనకారులకు, వారి వీరవిధేయులకీ.. * భార్య మీద ప్రేమ లేదంటూనే ముగ్గురు పిల్లల్ని కనే భర్తలకూ, ప్రేమంటే ఏమిటో తెలియకుండానే జీవితాలను ముగించేసిన కోటానుకోట్ల మంది స్త్రీలకూ.. * వాలెంటైన్స్ రోజు పార్కుల్లో దొరికినవారికి పెళ్లి చేసి, మిగిలిన 364 రోజులూ సామూహిక మౌనవ్రతం, వీలైతే అజ్ఞాతవాసం పాటించే సంఘదుష్కర్తలకీ.. * 'ఫిబ్రవరి 14 ప్రేమికుల రోజు కాదు, అది మన సంస్కృతి కాదు. అసలు మన సంస్కృతిలో ప్రేమే లేదు. ఉన్నదంతా పెళ్లే' అని వీడియోల్లో ఊదరగొట్టే బ్రెడ్ బన్నులకూ, వారిని టీలో ముంచుకొని తినే ఆధునికవాదులకూ..

**...వీళ్లందరికీ ప్రేమికుల రోజు శుభాకాంక్షలు..**

**- విశీ (వి.సాయివంశీ)**

• ఎడిటోరియల్

# ఢిల్లీ ఫలితాన్ని మార్చేసిన నిర్మల

ఢిల్లీ ప్రజల ఓటు ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వానికి వారిచ్చిన కితాబు కాదనీ, అది మోస పూరిత రాజకీయాలతో కేజ్రీవాల్ చేసిన ప్రయోగానికి ప్రజల తిరస్కారమని కాంగ్రెస్ అభిప్రాయపడితే వారికా హక్కుంది. దీనిలో కొద్దిగా వాస్తవం కూడా లేకపోలేదు. బీజేపీకి కిరీటం దక్కింది. ఢిల్లీ గద్దెను బీజేపీకి ఆమ్ ఆద్మీ పార్టీ అప్పగించింది. కానీ వారి ఓట్లు ఇంకా ఆవిరైపోలేదని ఆప్ నమ్ముతుంది. ఇలా అనుకునే హక్కు వారికి పూర్తిగా ఉంది. 42 శాతం ఓటు వాటా అంటే చిల్లర కాదు. సుదీర్ఘకాలం పరిగెత్తడానికి అవసరమైన శక్తి, నమ్మకం కేజ్రీవాల్‌కు ఉన్నాయా అనేది వేచి చూడాల్సిన విషయం. కానీ నరేంద్రమోదీ పాలన తన పాటని, నేపథ్య సంగీతాన్ని మార్చుకునేలా చేసిన బలం వారిదేననే వాస్తవంతో కేజ్రీవాల్ అతని సహచరులు సంతృప్తి పొందవచ్చు. మూడు అంశాల్లో బీజేపీ భిన్నమైన బాణీని ఆలపించించేలా చేశామనే ప్రతిష్ఠ మాత్రం ఆప్‌కు దక్కుతుంది. మొదటిది వారికి ఇష్టమైన సైద్ధాంతిక నేపథ్యగీతం హిందూ–ముస్లిం పాటను అటకెక్కించాల్సి వచ్చింది. ఢిల్లీ ఎన్నికల ప్రచార ప్రారంభంలో ఢిల్లీ అభ్యర్థి బీజేపీ పోటీదారులు మహారాష్ట్ర ఎన్నికల్లో మొదటగా తయారుచేసి ఆరెస్సెస్ కరుడుకట్టిన మనువాదులు వాడిన నినాదం– ఏక్ హైతో సేఫ్ హై (ఒకటిగా ఉంటే సురక్షితంగా ఉంటాం) ని ఎత్తుకున్నారు. అత్యంత వివాదాస్పదుడైన కపిల్ మిశ్రాకు అభ్యర్థిత్వం ఇచ్చినా, బీజేపీ వాక్చాతుర్యం వాదనలన్నీ ఆప్ తప్పుడు పనులు దుస్సాహసాలపైనే కేంద్రీకృతం అయ్యాయి. 'గోలీమారో సాలోంకో' (వెధవల్ని తూటాతో కాల్చేయండి) అనే అనురాగ్ ఠాకూర్ లేడు. మోడీ–షా ద్వయం కూడా ధ్రువీకరణ రాజకీయాలపై వాళ్లు తగిలించుకున్న దురదను అణుచుకున్నారు. ఇది వ్యూహాత్మకంగా వెనక్కు తగ్గడమే అయినా బీజేపీని ఇలా వంచిన ఘనత కేజ్రీవాల్‌కు దక్కుతుంది. ఆప్ నుంచి మధ్య తరగతిని దూరం చేయాలని బీజేపీ భావించింది. దానికోసం రాజధానిలో అతివాద హిందుత్వవాదులను పూర్తిగా నియంత్రించింది. కేంద్రనాయకత్వం చుట్టూ గిరికీలు తిరుగుతున్న, కరుడుకట్టిన హిందూత్వ గుంపునకు నాయకుడైన ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో చేసినట్టుగా కాకుండా మోదీ సమూహం కొంత నిగ్రహం పాటించింది. అర్థబలం, కండబలం గల మోదీకి రాజకీయాలకు, అత్యంత స్వీయకేంద్రిత రాజకీయం నడిపే కేజ్రీవాల్‌కు మధ్య ఎంపిక చేసుకోవడానికి ఢిల్లీ మధ్యతరగతి పెద్దగా ఏం ఆలోచించలేదు. ఇక రెండవది.. ఉచితాలు సంస్కృతిగా మోదీ స్వయంగా తిరస్కరించిన ఆప్ పాలన లోని సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని బీజేపీ వాగ్దానం చేసేలా చేసిన ఘనతగా కేజ్రీవాల్, అతని ఉద్రేకపూరితమైన మద్దతుదారులకు దక్కుతుంది. ఆప్ ప్రభుత్వం అందించిన రాయితీలు. ప్రజానుకూల పథకాలు కొనసాగిస్తామనే వాగ్దానం చేయడమే కాకుండా తానుగా కూడ తమ ఉచితాలను జోడించ వలసి వచ్చింది. ఇకపోతే ప్రభుత్వ అర్థశాస్త్రవేత్తలు, ఇతర సాధారణ అనుచరులు బీజేపీ ఉచితాలు కాదని, అవి సంక్షేమ చర్యలనీ మనకు చెబుతారు. వాళ్లేం చెప్పినా ఈ పథకాల అమలుకు బీజేపీ కట్టుబడింది. అది కూడా మోదీ గ్యారంటీతోనే. అయిష్టంగానైనా సరే ఈ రూపంలో ఎంతోకొంత సంపద పునఃపంపిణీకి అంగీకరించింది. చాలా అప్రమత్తంగా ఉండే ఆప్ నాయకత్వం, కార్యకర్తలు ఈ వాగ్దానాలు అమలు జరిగేలా చూస్తారని ఆశించవచ్చు. మూడవది తమ ఆర్థిక/ ప్రాధాన్యతల గురించి తనను తాను గిల్లి చూసుకోవాల్సిన స్థితి ఢిల్లీ పోరువల్ల బీజేపీకి ఏర్పడింది. ఎక్కువగా తన దృష్టిని పేదలపై కేంద్రకరించడం వలన ఆప్ పార్టీ పేద మధ్యతరగతి కూటమిలో పగుళ్లు ఏర్పడ్డాయనే ప్రచారమైన భారం నుంచి లబ్ధి పొందడానికి గాను కేంద్రప్రభుత్వం తన తాజా బడ్జెట్‌లో తన అలవాటుకు భిన్నంగా మధ్య తరగతికి భారీ ఆదాయపు పన్ను రాయితీలు కలగచేసింది. ఢిల్లీ జనాభాలో దాదాపుగా 67 శాతం మధ్యతరగతి వాళ్లని అంచనా. నిర్మలా సీతారామన్ తాజా బడ్జెట్ ఆటను ఎలా మార్చిందో నిరూపించడానికి ప్రొఫెషనల్ గణాంక నిపుణుల విశ్లేషణలను గమనిస్తే అర్థమవుతుంది. సగం రాష్ట్రంపై రాజకీయ నియంత్రణ సాధించడానికి మోదీ ప్రభుత్వం లక్ష కోట్ల పన్ను ఆదాయం వదిలేసుకుంది. భవిష్యత్తు కోసం కొత్తగా ధనికులైన ఈ మధ్యతరగతి వినిమయచక్రం ప్రారంభిస్తారో లేదో? ప్రస్తుతానికి మాత్రం మోదీ ప్రభుత్వం అరవింద్ కేజ్రీవాల్ అనే ఒక ప్రమాదకర రాజకీయ వ్యక్తిత్వానికి ఇప్పటివరకైతే అడ్డుకున్నామనే తృప్తి పొందవచ్చు. మధ్యతరగతి కేజ్రీవాల్‌ను వదిలేసిందంటే దానికి కారణం కేజ్రీవాల్ ఇక ఎంతమాత్రం కొత్త తరహా రాజకీయాల ప్రతీకగా లేడని బీజేపీ సైద్ధాంతిక గురువులు, బీజేపీ అనుయాయులు భావించడం తప్పేమి కాదు. ఆప్ నుంచి దూరం కావడం అంటే మధ్యతరగతి విలువల తపనను, మంచి పరిపాలన అందించే వాగ్దానాలను వదిలేసు కుందని కాదు. ఈ తపనే మోదీకి అతిపెద్ద బలహీనతగా రుజువుకానుంది.



ఆమె ఓ అందాల రాణి. మిస్ సౌత్ అమెరికా టైటిల్ ను కైవసం చేసుకున్న హొయలు ఆమె సొంతం. టెక్సాస్ లో జరిగిన ఛాంపియన్ ఆఫ్ ది వరల్డ్ పోటీల్లో ఆ కిరీటం గెల్చుకున్న నవ్వయవ్వన మందాకిని. మిస్ యూనివర్స్ తరహా పోటీల్లో మిగతావారందరినీ తోసిరాజని.. టైటిల్ గెల్చుకుంది. అయితే, ఆమె మన భారతసంతతి బిడ్డ.. నెలోర్ బ్రీడ్.. సారీ నెల్లూరు అనుకునేరు! కానీ, అదే మనకిప్పుడు గర్వకారణం. ఇంతకీ ఆ బ్రీడ్ ఎవరనేగా..?

## బ్రెజిల్‌లో 40కోట్ల విలువ.. మిస్ సౌత్ అమెరికా..

# ఎవరా మన దేశస్తురాలు?

భారత సంతతికి చెందిన ఓ ఆవే ఆ అందాల రాణి. అవునూ, ఇప్పుడా ఆ ఆవు రికార్డుల మీద రికార్డులను కొల్లగొడుతోంది. మిస్ సౌత్ అమెరికాతో ఆగిందనుకుంటున్నారా? ఆమె గిన్నీస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఇంతకీ ఆ అందాల ఆవు పేరేంటి..? దాని ప్రత్యేకతేంటి..?

వియాటినా–19 పేరు గల నెలోర్ బ్రీడ్ ఆవు 2024 లోనే అమ్ముడైన ఆవుల్లో ఖరీదైన ఆవుగా గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ లోకెక్కింది. ఏకంగా 40 కోట్ల రూపాయలకు అమ్ముడుపోవడానికి అంతగా ఈ నెలోర్ బ్రీడ్ ప్రత్యేకతలేంటంటారా..?

53 నెలల వయసున్న నెలోర్ జాతి ఆవు బ్రెజిల్ లోని మినాస్ గెరైస్ లో ఆవుల వేలంపాటలో పాల్గొంది. దీని బరువు ఏకంగా 1101 కిలోల బరువుండగా.. ఈ జాతి ఆవు బరువే సర్వసాధారణంగా మిగిలిన ఆవుల కంటే రెండు రెట్లెక్కువ. అందుకే ఇప్పుడు పశుప్రపంచంతో పాటు.. మానవ ప్రపంచమూ మన నెలోర్ బ్రీడ్ ఆవు గురించి ముచ్చటించుకుంటుంది.

ఇది కేవలం ఆరోగ్యకరమైన ఆవుగా 40 కోట్ల రూపాయలకు అమ్ముడుపోయి గిన్నీస్ రికార్డుకెక్కడమే కాకుండా.. మిస్ సౌత్ అమెరికా టైటిల్‌ను కూడా గెల్చుకోవడంతో ఈ ఆవు క్రేజ్ అమాంతం పెరిగిపోయింది.

ఆవు మూపురమొక్కటి చాలు.. యాగంటి క్షేత్రం నుంచి బ్రెజిల్ లో వేలంపాట కోసం ఊరికివచ్చిన బసవన్నను తలపిస్తుంది. ఇక ఈ ఆవు కండరాల నిర్మాణం, జన్యుపరంగా వచ్చిన ఆరోగ్యం, దాంతోపాటే సొగసైన శ్వేత వర్ణంలోని శరీరం వంటివి.. ఛాంపియన్ ఆఫ్ ది వరల్డ్ పోటీల్లో న్యాయనిర్ణేతలను తెగ ఆకట్టుకున్నాయి. అందుకే ముచ్చటపడ్డ న్యాయనిర్ణేతలకు ఇంకే ఆవూ మన నెలోర్ బ్రీడ్‌లా కనిపించకపోయేసరికి.. మిస్ సౌత్ అమెరికా టైటిల్ ఇచ్చిపడేశారు.

ముఖ్యంగా ఉష్ణమండల వాతావరణంలో పెరగడంతో ఈ నెలోర్ జాతి బ్రీడ్ ఆవులకుండే వ్యాధినిరోధకత పాటు.. వీటి సంతానోత్పత్తి సామర్థ్యం వల్ల వియాటినా–19 పిండాలకు ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు విపరీతమైన డిమాండ్ ఏర్పడుతోంది.

బ్రెజిల్ కు చెందిన పశువైద్యురాలు లారానీ మాత్రిన్స్.. అసలు ఆరోగ్య పరిపూర్ణత అంటే ఎలా ఉండాలో ఈ నెలోర్ బ్రీడ్ ఆవును చూస్తే అర్థమైతుందంటారు. దీని యజమాని చాలా లక్కీఫెల్లో అంటూ ఆమె చెప్పుకొచ్చారు.

మన నెలోర్ బ్రీడ్ ఆవులపై బ్రెజిల్ ఎప్పుడూ ముచ్చటపడుతూనే ఉంది. అందుకే, ప్రపంచంలోనే అత్యధిక నెలోర్ జాతి ఆవులు బ్రెజిల్ లో ఉన్నాయి. ఈ ఆవుల్లోనూ 80 శాతం జెబూ సంతతికి చెందినవి. శతాబ్దాల నుంచే ఈ జాతంటే బ్రెజిల్ వాసులకిష్టం. 1868 నుంచే ఈ జాతి పశువులను మన నుంచి బ్రెజిల్ దిగుమతి చేసుకుంటోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఒంగోలు పశుపరిశ్రమలో ఈ నెలోర్ జాతి ఓ రకం. యూఎస్ లెక్కల ప్రకారం బ్రెజిల్ పశుపరిశ్రమ ఇలాంటి ఆవుల సంతతిని పెంచుతూ దాదాపు ఇప్పటికే 230 మిలియన్ల ఆవులను కల్గి ఉన్నట్టు ఓ అంచనా.

**అదండి మనవాళ్లు అమెరికాలో, చైనా, రష్యాల్లో ఉంటే ఎంత గర్వపడుతున్నామో.. మన దేశసంతతికి చెంది పశుపక్షాదులకు కూడా ఇప్పుడు అంతర్జాతీయంగా మంచి డిమాండ్‌ను సంతరించుకుంటున్నాయంటే.. అసలిది కదా జీవవైవిధ్యం.**

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో..

# అందం కంటే.. ఆకర్షణ ముఖ్యం!





**హీరోల కైనా హీరోయిన్స్‌కైనా అందం కంటే ఆకర్షణ అనేది ముఖ్యం.అందులోను హీరోయిన్స్‌కు కాస్త మాస్ అప్పీల్‌తో పాటు మంచి బాడీ లాంగ్వేజ్ కలిగి వుండడం ఇంకాస్త ముఖ్యం. రష్మికనీ, కీయారా అద్వానీనీ తీసుకుంటే బహుశా రష్మికని మ్యాకప్ తీసేస్తే ఎవరూ గుర్తుపట్టక పోవచ్చు.ఎత్తు కూడా నాలుగు అడుగులు వున్నట్టగా వుంటుంది.అదే కియారా అద్వానీ అయితే హీరోలకి మించిన పొడుగు, తెల్లగా పోత పోసిన విగ్రహంలా వుండవచ్చు,కానీ వెండి తెరకి రంగుతో పనిలేదు.అదే వుంటే మ్యాకప్ మ్యాన్ లకు పని వుండేదే కాదు.**

రష్మీక అందరినీ ఆకట్టుకునేలా వుండడంతో పాటు ఏ హీరోతో చేసినా పర్ఫెక్ట్ ఫెయిర్‌లా కనిపిస్తుంది. నిన్న ఒక ఫోటోచూసాను స్వర్ణదేవాలయం దగ్గర ఓ నార్త్ హీరోతో పాటు ఏదో సినిమా ప్రమోషన్‌లో భాగంగా. ఆమెనలా చూస్తే పుష్ప హీరోయిన్ అనుకోరు.ఆ నార్త్ హీరోకి భార్య అనో లేక ఓ పంజాబీ అమ్మాయి అనో అనుకుంటారు.ఆమె అంతలా జెల్ అయిపోతుంది ఎవరితో నటించి నా కూడా. అందుకే ఆమె నేషనల్ క్రష్ అయ్యింది,కియారా అద్వానీ క్రష్ నేషనల్ అయ్యింది.హీరో జూనియర్ ఇంటర్ చదివే రోజుల్లో డిగ్రీ ఫైనల్ ఇయర్ స్టూడెంట్‌లా అనిపించే ఆమె హీరోయిన్ అంటే ఆ సినిమా ఫ్లాప్ అని తెలుగు ప్రేక్షకుడు మెంటల్‌గా డిసైడ్ అయిపోతాడు.అయినా మన నిర్మాత లకి హీరోలకి తెల్ల తోలు అంటే అదో రకం ఇది. సంక్రాంతికి వస్తున్నాంలో నటించిన ఐశ్వర్య,మీనాక్షి చౌదరిలది అదే రకం కాంబో. ఐశ్వర్య మన పక్కింటి వెంకటేష్ పెళ్ళం లాగా వుంటే మీనాక్షి ఇంపోర్టెడ్ మెటీరియల్లా వుంటుం ది.కానీ ఆ కియారా కంటే మీనాక్షి బెటర్,ఈ సారి ఎవరైనా కీయారా నీ హీరో యిన్‌గా కావాలి అనుకుంటే వాళ్ళు మీనాక్షితో సరిపెట్టుకుంటే బెటర్. అంత కంటే ముఖ్యంగా నయనతార లాంటి ప్రమోషన్‌లకి రాని హీరోయిన్లు వీరిని చూసి బుద్ధి తెచ్చుకోవాలి.సంక్రాంతికి వచ్చిన వారి సినిమా 300 కోట్లు వసూలు చేసేసింది అంటే అందులో ఆ ఇద్దరి హీరోయిన్ల ప్రమోషన్ వాటా ఖచ్చితంగా వంద కోట్లు వుందన్నట్టే. ఇక ఆ ఐశ్వర్య, మీనాక్షి లు ఇద్దరూ ఎవరింటికి వాళ్ళు వెళ్లి పోయి వారి కొత్త సినిమాల సంగతి చూసుకోవడం బెటర్. పాపం వాళ్ళు ఎపుడో డిసెంబర్ నెలలో వచ్చినట్టున్నారు ఇంటి నుంచి బయటకి సినిమా ప్రమోషన్‌లకని చెప్పి ఇంకా ఇక్కడిక్కడే తిరుగుతున్నారు సినిమానీ పట్టుకుని. ఇంకా అలా తిరగడం వల్ల వారికి నయాపైసా ఉపయోగం ఉండదు సరికదా అనవసరంగా లేని పోనీ అనుమానాలు వచ్చేస్తాయి మన జనానికి !!!

- రఘు శ్రీమంతుల





## పుష్పరాజ్ కుమార్తె స్టన్నింగ్ లుక్!!

పావని కరణం .. ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న పేరు. తెలుగు ఫిలింసర్కిల్స్ లోను ఈ తెలుగమ్మాయి ప్రతిభ గురించి చర్చ సాగుతోంది. పుష్ప 1, పుష్ప 2 చిత్రాల్లో నటించిన పావని కరణం ఎంపిక చేసిన పాత్రకు పూర్తి న్యాయం చేసింది. అసలు ఇంటి పేరుతో ఒక ఐడెంటిటీ లేని పుష్పరాజ్ కి అన్న కూతురు కావేరిగా పావని నటించింది. అంతేకాదు సొంత అన్నయ్య అజయ్.. పుష్పరాజ్‌ని అవమానిస్తుంటే, చివరికి అతడిని అన్ని అవమానాల నుంచి బయటపడేసే కీలక పాత్రలో పావని కనిపించింది. పుష్ప 2 క్లైమాక్స్ ని అర్థవంతంగా ముగించేందుకు సుకుమార్ ఎంతో తెలివిగా అజయ్ కుమార్తె పాత్రను ఉపయోగించుకున్నారు. ఆ పాత్రలో అద్భుతంగా నటించింది పావని. పల్లెటూరిలో ఇంటి పేరు లేకుండా ఉంలికున్న దానికొడుకు అంటే ఆ బాధ ఎలా ఉంటుందో పల్లెల్లో నివశించే పుష్పరాజ్ లాంటి వ్యక్తులకు తెలుస్తుంది. ఆ బాధను తెరపై పండించడంలో బన్ని వందశాతం మార్కులు కొట్టేసాడు. అలాగే కీలక సమయంలో అజయ్ కుమార్తెపై సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. అకస్మాత్తుగా కొందరు పోకిరి కుర్రాళ్లు పుష్పరాజ్ అన్న కూతురు కావేరి (పావని)ని కిడ్నాప్ చేసాక యాక్షన్ డ్రామా మరో లెవల్ కి చేరుకుంటుంది. చిన్నాన్న పుష్పరాజ్ పాత్రలో ఎమోషనల్ కంటెంట్‌ని ఎలివేట్ చేసేందుకు పావని పాత్ర సహకరించింది. ఇక పావని పదహారణాల పల్లెటూరి తెలుగమ్మాయి ఎలా ఉంటుందో అలాగే తెరపై చీరల్లో మురిపించింది. క్లైమాక్స్‌లో పావనిని అడ్డు పెట్టుకుని పుష్పరాజ్ పై ప్రతీకారం తీర్చుకోవాలనుకున్న రౌడీలకు జీవితంలో మర్చిపోలేని విధంగా ఏం జరిగిందన్నది తెరపైనే చూడాలి. మొత్తానికి పావనికి సుకుమార్ కీలక పాత్రలో ఆఫర్ ఇవ్వడంతో ఆ ఎమోషన్‌ని తను ఎప్పటికీ దాచుకోలేకపోతోంది. ఇంతకుముందు ఒక వేదికపై కన్నీటిపర్యంతం అవుతూ సుక్కూ అండ్ బన్నీకి థాంక్స్ చెప్పింది కూడా. పావని తెలుగు ఇండస్ట్రీలో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న నటి. ఈ భామ ఇంతకుముందు సివరపల్లి అనే చిత్రంలో నటించింది. ఆ సినిమా పోస్టర్లను కూడా పావని ఇన్‌స్టాలో షేర్ చేసింది. ముఖ్యంగా పుష్ప 2లో తన పాత్రకు సంబంధించిన చాలా ఫోటోలను పావని ఇన్ స్టాలో రెగ్యులర్‌గా అప్‌డేట్ చేసింది. ప్రతిభకు పట్టంగట్టే టాలీవుడ్‌లో ఈ తెలుగమ్మాయి కెరీర్ కూడా మునుముందు స్కై ఈజ్ లిమిట్ అన్న చందంగా దూసుకెళుతుందనడంలో సందేహం లేదు.



- తుపాకి.కామ్ సౌజన్యంతో..



దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ వర్మఅహ్మద్‌ఖాన్ తో కలిసి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శాంతిశ్రీ, ఎస్డీసీ పద్మావతి, అప్పారావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## సంజీవయ్య ఆశయ సాధనకు కృషి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం సంజీవయ్య ఆశయ సాధనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంజీవయ్య జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆయన మంచి గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారన్నారు. తన పదవీ కాలంలో అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలతో ప్రజల అభ్యున్నతికి, వారి జీవన ప్రమాణాలు మెరుగుకు విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన జయంతి వేడుకలను కూటమి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు.



దామోదరం సంజీవయ్య 104 జయంతి సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రాని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ రమణమాదిగ తదితరులున్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

# 11,558 ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీ ఉద్యోగాలు.. త్వరలో ఎగ్జామ్ డేట్స్ ఖరారు



రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ (ఆర్ఆర్‌బీ) త్వరలో నాన్- టెక్నికల్ పాపులర్ కేటగిరీ (ఎన్టీపీసీ) రిక్రూట్‌మెంట్ పరీక్షకు సంబంధించి తేదీలు, అడ్మిట్ కార్డ్‌ను విడుదల చేయనుంది. అయితే.. ప్రస్తుతానికి దీనికి సంబంధించి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఆర్ఆర్‌బీ ఎన్టీపీసీ యూజీ, గ్రాడ్యుయేట్- లెవల్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష తేదీలను ఆర్ఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌లలో త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు భావిస్తున్నారు. అయితే.. మార్చి- ఏప్రిల్ నెలలో ఈ పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది.

ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేసిన తర్వాత సంబంధిత ప్రాంతీయ ఆర్ఆర్‌బీ వెబ్‌సైట్‌ల ద్వారా వివరణాత్మక పరీక్ష షెడ్యూల్‌ను చెక్ చేసుకోవచ్చు. ఆర్ఆర్‌బీ నాన్- టెక్నికల్ పాపులర్ కేటగిరీ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా మొత్తం 11,558 ఖాళీలను భర్తీ చేయనుంది. వీటిలో 8,113 గ్రాడ్యుయేట్- లెవల్ పోస్టులు ఉండగా.. 3,445 అండర్ గ్రాడ్యుయేట్- లెవల్ పోస్టులు ఉన్నాయి. ఆర్ఆర్‌బీ ఎన్‌టీపీసీ ఇంటర్, డిగ్రీ పోస్టులకు పరీక్ష విధానం, సిలబస్ ఒకటే ఉంటుంది. అందువల్ల డిగ్రీ విద్యార్హత ఉన్నవారు గ్రాడ్యుయేట్, యూజీ ఉద్యోగాలకు పోటీ పడొచ్చు. పరీక్షలు మాత్రం విడిగానే నిర్వహిస్తారు. డిగ్రీతో పోలిస్తే ఇంటర్మీడియట్ పోస్టుల ప్రశ్నలు కొంచెం తక్కువ కఠినంగా ఉంటాయి. గ్రాడ్యుయేట్ పోస్టుల్లో చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్, స్టేషన్ మాస్టర్, గూడ్స్ ట్రైన్ మేనేజర్, జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులున్నాయి.

అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) కేటగిరీలో.. కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్, అకౌంట్ క్లర్క్, ట్రైన్స్ క్లర్క్, జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్టు ఉద్యోగాలు ఉన్నాయి. ఈ కమర్షియల్ క్లర్క్ కమ్ టికెట్ క్లర్క్ ఉద్యోగాలకు లెవెల్-3 జీతం చెల్లిస్తారు. వీరికి రూ.21,700 మూల వేతనం ఉంటుంది. అన్నీ కలిపి సుమారు రూ.40,000 అందుకోవచ్చు. మిగిలినవి లెవెల్-2 ఉద్యోగాలు. వీటికి రూ.19,900 మూల వేతనం ఉంటుంది. అన్నీ కలిపి మొదటి నెల నుంచే సుమారు రూ.36,000 అందుకోవచ్చు.

| | |
|---|---|
| మొత్తం గ్రాడ్యుయేట్ పోస్టులు సంఖ్య: | 8113 |
| కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టులు: | 1,736 |
| స్టేషన్ మాస్టర్ పోస్టులు: | 994 |
| గూడ్స్ రైలు మేనేజర్ పోస్టులు: | 3,144 |
| జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ పోస్టులు: | 1,507 |
| సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులు: | 732 |
| మొత్తం యూజీ పోస్టుల సంఖ్య : | 3445 |
| కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్ పోస్టులు : | 2022 |
| అకౌంట్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులు : | 361 |
| జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులు : | 990 |
| ట్రైన్స్ క్లర్క్ పోస్టులు : | 72 |

సమయం.కామ్ సౌజన్యంతో...



జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు విషయంలో ప్రజలు మిల్లర్లు రైతులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని రైతులకు, ప్రజలక న్యాయం చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి చిట్టి భాస్కరరావు, శ్రీకాకుళం పట్టణ విభాగం ముంగి జగదీశ్వరరావు, శ్రీశయన సంఘం, శ్రీకాకుళం రూరల్ మండల అధ్యక్షులు తాటిరాజుల కూర్మారావులు జేసీ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**



ఇండియా టెక్సటైల్ ఎక్స్‌పోలో భాగంగా శుక్రవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను కేంద్ర టెక్సటైల్స్ మంత్రి గురురాజ్ సింగ్, రాష్ట్ర హ్యాండ్లూమ్స్& టెక్సటైల్స్ కమీషనర్ రేఖారాణితో కలిసి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రారంభించారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## వైకాపా ఐటీ వింగ్ అధ్యక్షుడిగా నండూరి చందు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



వైకాపా శ్రీకాకుళం నియోజకవర్గ ఐటీవింగ్ అధ్యక్షుడిగా శ్రీకాకుళానికి చెందిన నండూరి చందు ఎన్నికయ్యారు. ఇందులో భాగంగా నూతన అధ్యక్ష నియామిక పత్రాన్ని పార్టీ కేంద్రాలయం నుండి అందుకున్న నండూరి చందు మాట్లాడుతూ తనపై అపారమైన నమ్మకాన్ని ఉంచి ఐటివింగ్ అధ్యక్షునిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను సక్రమంగా నడిపిస్తూ , అందరి అభిమాన సహకారాలతో ముందుకు వెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.




స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఐటీడీఏ పీవో యశ్వంత్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆసుపత్రి ఆవరణంలో ప్రహరీ గోడ, నూతనంగా నియమిస్తున్న భవనాన్ని పరిశీలించారు. హాస్పిటల్లో రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయా లేవా అని సకాలంలో వైద్యం అందుతుందా లేదని రోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్పిటల్ మొత్తం సందర్శించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ ధర్మాన కిషోర్, డ్యూటీ డాక్టర్స్ స్నేహ రామకృష్ణలున్నారు.

**- సత్యంన్యూస్, కొత్తూరు**



వార్షిక తనిఖీల్లో సందర్భంగా కొత్తూరు పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం సందర్శించారు. ముందుగా స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలను పరిశీలించారు. పలు రికార్డులు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, మాదకద్రవ్యాలు, పేకాట, ఇసుక రవాణా వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డిఎస్పీ డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి, సీఐ చింతాడ ప్రసాద్, ఎస్సై అహమద్ అలీ, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు. **- సత్యంన్యూస్, కొత్తూరు**

## రథసప్తమి విజయవంతంపై అభినందన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలు రాష్ట్ర పండుగగా ఎంతో వేడుకగా నిర్వహించి పూర్తిస్థాయిలో సఫలీకతమయ్యారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను అభినందించారు. అమరావతిలో సెక్రటేరియట్‌లోని సీఎం పేసీలో ముఖ్యమంత్రిని గురువారము గొండు శంకర్ కలుసుకున్నారు. స్వామివారి ప్రసాదం, సూర్యనారాయణ స్వామివారి ఫోటో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని అభివృద్ధి పనులు, పనితీరుపై శంకర్‌ను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం వద్ద నిర్మించిన నర్సింగ్ కళాశాల పనులు నత్తనడకన జరగడంతో ఆ కాంట్రాక్టర్‌ని టెర్మినేట్ చేసినందున అదే కాంట్రాక్టర్ మళ్లీ సకాలంలో పనులు పూర్తి చేస్తామని చెప్పడంతో, పనులు అదే కాంట్రాక్టర్‌కి అప్పగించి, వేగవంతంగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించారు. దానిపై చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. అంతేకాకుండా నియోజకవర్గంలో పనితీరు బాగుందని ఇంకా ప్రజలకు దగ్గరై ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించే విధంగా ప్రజలకు చేరుకోవాలని, మరింత ప్రజల్లో మంచిని పొందాలని సూచించారు. ఎమ్మెల్యే శంకర్ పనితీరుపై చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అధికారులంతా రథసప్తమి పండుగ విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందించారు.

## విలువలకి రూపం దామోదరం సంజీవయ్య

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విలువలకి రూపం దామోదరం సంజీవయ్య అని దళిత సంఘాల నేతలు కొనియాడారు. బాబాసాహెబ్ అంబేద్కర్ బాటలో పయనించి ఎదిగిన మహానేత అని పేర్కొన్నారు. నగరంలోని పాలకొండ రోడ్డులో గల దామోదరం సంజీవయ్య పార్క్‌లో 104వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. దళితసంఘాల జేఏసీ నేతలు దామోదరం సంజీవయ్య ట్రస్ట్ ప్రతినిధులు, అంబేద్కర్స్ ఇండియా మిషన్ నాయకులు పాల్గొన్నారు. ఆ పార్క్ లో ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి వారంతా పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు తైక్వాండో శ్రీను, కంఠ వేణు, యజ్జల గురుమూర్తిలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళిత ముఖ్యమంత్రిగా సేవలు అందజేసిన దామోదరం సంజీవయ్య నేటి యువతకి స్ఫూర్తిదాయకమన్నారు. అవినీతికి తావులేకుండా రాజకీయాలు చేసిన మహానీయుడు సంజీవయ్య అన్నారు. నిరాడంబరంగా రాజకీయాలను ఆయన నిర్వహించి అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసి అందరి మన్ననలను సంజీవయ్య పొందారన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసిన సంజీవయ్య ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగుల సంఘం నాయకుడు బడియ కామరాజు, అర్జి కోటి, పురుషోత్తం రాంబాబు, పెయ్యల చంటి, నేతల అప్పారావు, సీర రాజేశ్వరి, అబ్బాస్, కళ్యాణ్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలని ప్రోగ్రెసివ్ సైకాలజీ జిల్లా అధ్యక్షులు బుడుమూరు సూర్యారావు పేర్కొన్నారు. ఒప్పివాడ వెంకంపేట జడ్పీ హైస్కూల్లో శుక్రవారం జరిగిన విజయభవ అనే కార్యక్రమంలో జడ్.పి.హెచ్.స్కూల్ ప్రధానోపాధ్యాయులు చింతాడ నారాయణ స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ముఖ్యఅతిథిగా హాజరైన బూర్జ స్టేషన్ హౌస్‌ఆఫీసర్ ఎం.ప్రవళిక మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను అవగాహన చేసుకుని, సెల్‌ఫోన్‌కు ,టీవీకి దూరంగా ఉండి రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని తెలియజేశారు. బుడుమూరు సూర్యారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షలు అంటే భయాన్ని పోగొట్టి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడంలో భాగంగా అడ్వాన్స్ సైకాలజికల్ అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ సూర్యారావు మాట్లాడుతూ, ముఖ్యంగా పరీక్షలు అనేవి ప్రతి విద్యార్థి కూడా స్నేహితులుగా భావించాలి పరీక్షలు అనేవి విద్యార్థులను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరవేసేందుకు దోహదపడతాయన్నారు. ముఖ్యంగా మానవుడి మెదడు యొక్క సామర్థ్యము 4.7 బిలియన్ పుస్తకాలు చదివే సామర్థ్యం కలదన్నారు. ఒక్కొక్క పుస్తకము




200 పేజీల వరకు ఉంటుందని, పదవ తరగతి విద్యార్థులు ఏడు నుంచి 20 వరకు పుస్తకాలు మాత్రమే చదువుతారన్నారు. వాటిని ఒక పద్ధతి ప్రకారము సమయాన్ని కేటాయించుకుంటూ చదవడం, అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోవడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. అలాగే ఒక్కొక్క సబ్జెక్టును రెండు గంటలుగా విభజిస్తూ ప్రతి 25 నిమిషాలకు రెండు నుంచి నాలుగు నిమిషాలు విరామం ఇస్తూ చదివినప్పుడు మనకు చాలా స్పష్టంగా విషయాన్ని అర్థం చేసుకోగలమన్నారు. ముఖ్యంగా ఈ విరామ కాలంలో బ్రీతింగ్ ఎక్సర్సైజ్ చేసుకోవాలన్నారు. అలాగే టీవీ, మొబైల్, ఇతర ప్రసారమాధ్యమాలకు దూరంగా ఉంటూ చదువు కొనసాగించాలన్నారు. అవసరమైన వ్యాయామము యోగా, ధ్యానము చేస్తూ, పౌష్టికరమైన ఆహారాన్ని స్వీకరిస్తూ, సమయానికి నిద్రపోతూ, పద్ధతి ప్రకారము చదివినట్లయితే విద్యార్థులు ఆశించిన ఫలితాలు సాధించగలరన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# అచ్చెన్న ఆదేశాల ఫైల్ మాయం!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాకు బీసీ స్టడీ సర్కిల్ మంజూరై దశాబ్దం పూర్తయినా ఇంతవరకు శాశ్వత భవనానికి నోచుకోలేదు. కొన్నాళ్ల పాటు అద్దె భవనంలో స్టడీ సర్కిల్ నిర్వహించిన అధికారులు తర్వాత సాంఘిక సంక్షేమశాఖ బీసీ బాలికల కాలేజీ వసతి గృహంలో రెండు గదుల్లో నెట్టుకొస్తున్నారు. తరగతులు మాత్రం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఉన్న వైటీసీలో అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. 2019లో జనవరి 12న అప్పటి బీసీ మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు రూ.5 కోట్లతో నగరంలోని 80 అడుగుల రోడ్డులో బీసీ భవన్‌కు శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంలోనే బీసీ స్టడీసర్కిల్‌ను ఇందులోనే నిర్వహించడానికి అనుమతులు మంజూరుచేస్తున్నట్టు బీసీ మంత్రిగా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన చేశారు. అందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం దానికి సంబంధించిన ఉత్తర, ప్రత్యుత్తరాలు నిర్వహించిన ఫైల్‌ను బీసీ సంక్షేమ శాఖ నుంచి మిస్ చేశారని ఆరోపణలున్నాయి. దీన్ని సాకుగా చూపించి బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిని అనురాధ స్టడీ సర్కిల్‌ను బీసీ భవన్‌లో నిర్వహించ కుండా అడ్డుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బీసీ భవనం ప్రారంభోత్స వానికి పూర్తి స్థాయిలో ముస్తాబవుతున్న వేళ స్టడీ సర్కిల్‌కు ఈ భవనంలో అవకాశం లేకుండా పోతోందని బీసీ సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. శ్రీకాకుళంతో పాటు అనేక జిల్లాల్లో బీసీ భవనాలకు శంకుస్థాపన జరిగినా చిత్తూరులో మాత్రమే బీసీ భవనం అందు బాటులోకి వచ్చింది. మంత్రి అచ్చెన్నాయుడు 2019 జనవరిలో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు చిత్తూరులో బీసీ భవన్‌లోనే బీసీ స్టడీసర్కిల్‌ని ఏర్పాటుచేశారు. అక్కడ లేని అభ్యంతరం ఇక్కడే ఎందుకన్న అనుమానం విద్యార్థులు, బీసీ సంఘాలు లేవనెత్తుతున్నాయి.

### అసౌకర్యాల నడుమ తరగతులు

జ్యోతిబా పూలే స్టడీ సర్కిల్ పేరుతో ప్రారంభమైన బీసీ స్డడీ సర్కిల్‌కు శాశ్వత భవనం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నా 2013 నుంచి ఇప్పటి వరకూ స్టేట్‌లోనే ఉత్తమ ఫలితాలు సాధించిన చరిత్ర జిల్లాకు ఉంది. 2013లో బీసీ స్టడీ సర్కిల్‌ను ఏడురోడ్ల జంక్షన్ దగ్గర ఒక అద్దె భవనంలో ప్రారంభించారు. శబ్దకాలుష్యం కారణంగా క్లాసులకు ఇబ్బంది ఎదురవుతుందని 2014లో ముద్దాడ చిన్నబాబు హాస్పిటల్ వెనుక గాంధీనగర్‌లో అద్దెకు ఒక భవనాన్ని తీసుకొని ఎనిమిదేళ్ల పాటు అరకొర వసతుల మధ్య నడిపించారు. ఆ తర్వాత జిల్లా ఉన్నతాధికారులు బీసీ భవనం పూర్తయ్యే వరకు స్థానిక 80 అడుగుల రోడ్డు వాంబే కాలనీకి ఆనుకొని ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కాలేజీ వసతి గృహంలో రెండు గదులు కేటాయించారు. ఇందులోనే డైరెక్టర్ కార్యాలయం, లైబ్రరీ, తరగతులు నిర్వహించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఉన్న భవనంలో విద్యార్థులు, సిబ్బందికి టాయ్‌లెట్స్ ఉన్నా వాటికి రన్నింగ్ వాటర్ కనెక్షన్ లేక ఇబ్బందులు పడుతున్నారు. తాగడానికి, వాడుక కోసం మంచినీళ్లు లేవు. అయినా విద్యార్థులు అసౌకర్యాల నడుమ నెట్టుకొస్తున్నారు. బ్యాంకు, డీఎస్సీ, గ్రూప్-2 కోచింగ్స్, తరగతుల కోసం ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఉన్న వైటీసీ భవనాన్ని ఆశ్రయిస్తున్నారు, వైటీసీలోనూ సరైన వసతి సౌకర్యాలు అందుబాటులో లేవు. అయినా అక్కడే నిర్వహిస్తున్నారు. వైటీసీలో బీసీ స్టడీ సర్కిల్ కోచింగ్ కోసం వచ్చే విద్యార్థినులు టాయిలెట్స్ లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినిలు బాయ్స్ హాస్టల్‌లోని టాయిలెట్స్‌ని వినియోగిస్తున్న పరిస్థితి.

### తప్పుదోవ పట్టిస్తున్నారు

ఇటీవల బీసీ భవన్ పనులను పరిశీలించడానికి వెళ్లిన స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌కు బీసీ స్టడీసర్కిల్ నిర్వహించే విషయంపై తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదారి పట్టించినట్టు బీసీ సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వైటీసీ భవనంలో సౌకర్యాలు లేకపోయినా పట్టుపట్టి అక్కడ బీసీ స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో ఇటీవల డీఎస్సీ కోచింగ్ క్లాస్‌లను నిర్వహించినట్టు విమర్శలు ఉన్నాయి. సరైన వసతి సౌకర్యాలు లేక వైటీసీ వరండా, పోర్టికో కింద కోచింగ్ క్లాసులు చెప్పించినట్టు ఆరోపణలున్నాయి. బీసీ భవన్‌లో స్టడీ సర్కిల్ ఏర్పాటుచేస్తే విద్యార్థులు రావడానికి దూరం అవుతుందని, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో వైటీసీ ఉండడంతో ఇక్కడ బీసీ స్టడీ సర్కిల్ కోచింగ్ క్లాసులు నిర్వహించడం వల్ల విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని స్టడీ సర్కిల్ డైరెక్టర్ అనురాధ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఒప్పిస్తున్నారని బీసీ సంఘాలు చెబుతున్నాయి.

### ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారు

2019 జనవరి 12న శంకుస్థాపన చేసిన బీసీ భవన్ పనులు వైకాపా పభుత్వం హయాంలో కొంత సాగినా, ఆతర్వాత నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. బీసీ భవన్ ప్రారంభమైనా అందులో బీసీ స్టడీ సర్కిల్ మార్చడానికి అవకాశం లేదని డైరెక్టర్ అనురాధ చెబుతున్నట్టు విద్యార్థులు, బీసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. చిత్తూరులో అందుబాటులోకి వచ్చిన బీసీ భవన్‌లోనే బీసీ స్టడీ సర్కిల్‌కి ప్రత్యేకంగా గదులు కట్టి వసతి కల్పించారు. దాని మాదిరిగానే జిల్లాలోని బీసీ భవన్‌లో బీసీ స్టడీసర్కిల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ వినిపిస్తుంది. వైటీసీలో పాఠాలు విని, లైబ్రరీ కోసం బీసీ స్టడీ సర్కిల్‌కు 80 అడుగుల రోడ్డుకు రావడం సాధ్యమవుతుందా అని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల బీసీ స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు లైబ్రరీని ఉపయోగించుకొనే అవకాశం కోల్పోతారన్న కొత్త వాదన తెరపైకి వచ్చింది. బీసీ భవన్‌లోనే అన్నిరకాల సౌకర్యాలు కల్పించినప్పుడు.. వైటీసీలో తరగతులు చెప్పించడం ఎందుకని బీసీ సంఘాలు డైరెక్టర్ అనురాధ తీరును తప్పుపడుతున్నాయి.

### పునఃపరిశీలించాలి..

బీసీ స్టడీ సర్కిల్ కోసం ప్రత్యేకంగా 10 ఎకరాల స్థలం సేకరించి డిజిటల్ లైబ్రరీతో సహా అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేస్తామని ప్రజాప్రతినిధులు హామీలు ఇవ్వడాన్ని బీసీ సంఘాలు, విద్యార్థులు తప్పుపడుతున్నారు. బీసీల కోసం శాశ్వత భవనం ఉన్నప్పుడు అందులోనే బీసీ స్టడీ సర్కిల్ ఎందుకు ఏర్పాటు చేయడం లేదన్న ప్రశ్నను బీసీ సంఘాలు లేవనెత్తుతున్నారు. 10 ఎకరాలు సేకరించి డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేసినంత వరకు కోచింగ్ క్లాసులు, లైబ్రరీ కోసం ప్రస్తుతం బీసీ భవనంలో స్టడీసర్కిల్‌ని కొనసాగించాలని విద్యార్థులు ప్రాధేయపడుతున్నారు. తరగతులు అయిన తర్వాత రిఫరెన్స్ కోసం లైబ్రరీని ఆశ్రయించడానికి అవకాశం ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు బీసీ స్టడీ సర్కిల్ విషయంలో పునఃపరిశీలించాలని కోరుతున్నారు.

# అధిక వడ్డీకి ఆశపడి.. మోసపోయారు?

## డబ్బులు రాబట్టుకోవడానికి బాధిత కుటుంబం నిరసన




(సత్యంన్యూస్, టెక్కలి)

అధిక వడ్డీకి ఆశపడి గొల్లవీధికి చెందిన గోపి దలై దమయంతి, కోడలు గాయత్రి బారినపడి సంతబొమ్మాళికి చెందిన పందిరి సన్యాసమ్మ, అప్పన్న దంపతులు నిండా మునిగిపోయారు. రూ.18.60 లక్షలు ఇచ్చి మోసపోయామని లబో దిబోమంటూ బాధితులు సన్యాసమ్మ, అప్పన్నతో పాటు కుమార్తె శ్రావణి, కుమారుడు కార్తీక్‌తో కలిసి గాయత్రి ఇంటి ముందు శుక్రవారం నిర సనకు దిగారు. తన బిడ్డలకు రైల్వేలో ఉద్యోగాలు వేయిస్తానంటూ గాయత్రి డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుండా పోలీసులు, లాయర్లతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ సన్యాసమ్మ వంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్యహత్యకు ప్రయత్నించింది. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సన్యాసమ్మను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే..

సంతబొమ్మాళికి చెందిన పందిరి సన్యాసమ్మ, అప్పన్న ఊరూరా తిరుగుతూ గాజులు, పూసలు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ క్రమంలోనే టెక్కలి గొల్లవీధికి చెందిన గోపిదలై దమయంతితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచ యంతో దమయంతి ఆమె కోడలు, వరుసకు మనుమరాలు అయిన గాయత్రి ఎంటరై 10 రూపాయలు వడ్డీకి డబ్బులు ఇప్పిస్తే కమీషన్ ఇస్తామని సన్మాసమ్మకు నమ్మబలికారని తెలిసింది. దీంతో ఆమె మొదట లక్ష రూపాయలు రూ. 10 వడ్డీకి ఇవ్వగా, కమీషన్ కింద రూ.10 వేలు ఇచ్చినట్టు తెలిసింది. దీనికి ఆశపడిన పందిరి సన్యాసమ్మ గాయత్రి అకౌంట్‌లో రూ.6లక్షలు విడతల వారీగా జమచేసి వడ్డీ తీసుకున్నట్టు తెలిసింది. ఆ తర్వాత కూడా అదే మాదిరిగా రూ.18.60 లక్షలు ఇచ్చి నట్టు సన్యాసమ్మ చెబుతుంది.

### పోలీసుల వద్ద 'పంచాయితీ'

ఈవ్యవహారంపై టెక్కలి, సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్లలో ఇరువురి మధ్య పంచాయితీ నడిచినట్టు తెలిసింది. ఆ సందర్భంలోనే టెక్కలి, సంతబొ మ్మాళి పోలీస్ స్టేషన్లలో పోలీసుల సమక్షంలోనే గాయత్రి బాధితురాలు పందిరి సన్యాసమ్మకు డబ్బులు బాకీ ఉన్నట్టు స్టాంప్ పేపర్లపై రాయించి సంతకాలు చేయించారని సమాచారం. పంచా యితీ గడువు ముగిసినా గాయత్రి డబ్బులు ఇవ్వక పోవడంతో బాధితురాలు సన్యాసమ్మ కుటుంబ సభ్యులంతా కలిసి నిరసన తెలిపారు. అధిక వడ్డీకి ఆశపడి రూ.18.60 లక్షలు ఇవ్వడానికి స్వగ్రామంలో ఉన్న ఇంటిని, బంగారాన్ని విక్ర యించి నగదును గాయత్రీ ఖాతాలో జమ చేయగా, నేరుగా కొంత మొత్తం కూడా ఇచ్చారని, ఆ తర్వాత అసలు, వడ్డీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న గాయత్రి తన ఇద్దరు పిల్లలకు రైల్వేలో ఉద్యోగం వేయిస్తానని డబ్బులు తీసుకున్నట్టు పోలీసు ఉన్నతాధికారులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. గాయత్రి కుటుంబంలో కొందరికి మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్యంటూ స్థానికులు చెబుతున్నారు. వీరి మాయ మాటలతో అధిక వడ్డీకి ఆశపడి సన్యాసమ్మ మోసపోయింది. అన్యాయానికి గురైన సన్యాసమ్మ పోలీసులను ఆశ్రయించినా పట్టించుకోకపోవడంతో ఉద్యోగాల పేరుతో మోసం చేసినట్టు ఫ్లెక్సీ ఏర్పాటు చేసి గాయత్రీ ఇంటిముందు సన్యాసమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం ఆందోళనకు దిగారు.

# మీరేం చేస్తే.. మేమూ అదే

## భారత్‌పై టారిఫ్‌ల విషయంలో తగ్గేదే లేదన్న ట్రంప్..!



(సత్యం ఐటీ డెస్క్)

భారత్ ఎంత మిత్ర దేశమైనా పరస్పర పన్నుల విషయంలో తగ్గేదేలే అని సున్నితంగా తేల్చిచెప్పారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా శుక్రవారం శ్వేత సౌధంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు సంయుక్త విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెసిప్రోకల్ టారిఫ్‌ల గురించి వచ్చిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. భారత్ సహా ఇతర దేశాలపై విధిస్తున్న పన్నులను సమర్థించుకొన్నారు.

'ప్రస్తుతం మేము రెసిప్రోకల్ నేషన్ (ఎదుటి దేశం ఎలా స్పందిస్తే.. అలానే ప్రతిస్పందించే దేశం). భారత్ లేదా మరే దేశమైనా సరే.. మాపై తక్కువ పన్నులు విధిస్తే.. మేము కూడా అలానే టారిఫ్‌లు వేస్తాము. భారత్ మాపై ఎంత శాతం పన్ను విధిస్తే.. మేమూ అంతే ఛార్జి చేస్తాము. వారి సుంకాలు ఎంత ఎక్కువన్నది ఇక మా సమస్య కాదు. నా తొలివిడత పాలనలో అధిక టారిఫ్‌లపై చర్చించాము. కానీ, ఎలాంటి రాయితీ లు పొందలేకపోయాం. అందుకే మేము తేలికైన మార్గాన్ని ఎంచుకొన్నాం. వారెంత విధిస్తే.. మేము అంతే ఛార్జి చేస్తాం. అమెరికా ప్రజల కోసం ఇదే సరైన చర్య. మాకు ఐరోపా అత్యంత సమస్యా త్మకం. ఎవరూ కనీవినీ ఎరుగని స్థాయిలో మాపై పన్నులు విధిస్తున్నారు. వారు చాలా విషయాల్లో అడ్వాంటేజ్ తీసుకొంటున్నారు. ఆ చర్యలతో మేము ఏమాత్రం సంతృప్తిగా లేము.

ఇక చైనా విషయం మరింత భయంకరం. నేను అధికారంలోకి రాక ముందు కనీసం 10 శాతం కూడా పన్ను విధించేవారు కాదు. నేను తొలిసారి పగ్గాలు చేపట్టినప్పుడు వారి నుంచి వందల బిలి యన్ డాలర్లు పన్నుల రూపంలో వసూలు చేశాం. మేము సరిగ్గా ఎలా చేయాలో అలానే చేశాము' అని ట్రంప్ వివరించారు. మోదీ-ట్రంప్ పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్ల దాటించే లక్ష్యంతో మిషన్-500ను ప్రకటించారు. ఇక మోదీ పర్యటన రోజే పరస్పర టారిఫ్‌ల విషయాన్ని ట్రంప్ ముందుగానే తెరపైకి తెచ్చి బలమైన సంకేతాలు పంపారు. 'మూడు అద్భుతమైన వారాలు. ఇప్పటివరకు అత్యుత్తమైనవి కావచ్చు. కానీ, 'నేడు మాత్రం అత్యంత ముఖ్యమైంది. రెసిప్రోకల్ టారిఫ్స్' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలను పోస్టు చేశారు. మోదీతో భేటీకి కొద్ది గంటల ముందే.. అన్ని దేశాలపై పరస్పర సుంకాలను అమలు చేస్తూ.. ఫైల్‌పై సంతకం చేశారు.









# 'డ్రాప్ బాక్స్' రూల్స్ కఠినతరం..

## హెచ్-1బీ రెన్యువల్‌కు ఇక ఎదురుచూపులే..!

(సత్యం ఐటీ డెస్క్)

అమెరికా వీసా రెన్యువల్ చేయాలనుకునే వారికి చేదు వార్త. వీసాల పునరుద్ధరణ కోసం తీసుకొచ్చిన 'డ్రాప్‌బాక్స్' నిబంధనలను అగ్రరాజ్యం కఠినతరం చేసినట్లు తెలుస్తోంది. ఇకపై ఈ విధానం కింద గత 12 నెలల్లో గడువుతీరిన వీసాలను మాత్రమే ఇంటర్వ్యూ లేకుండా రెన్యువల్ చేసుకునే అవకాశం ఉంటుంది. అంతకుముందు 48 నెలల కాలానికి ఈ సదుపాయం అందుబాటులో ఉండేది. తాజా నిబంధనలను తక్షణమే అమల్లోకి తెచ్చినట్లు సమాచారం. దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన




వెలువడనప్పటికీ.. ఇప్పటికే వీసా అప్లికేషన్ కేంద్రాల్లో కొత్త రూల్స్‌ను అమలు చేస్తున్నట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. తాజా నిబంధనలతో హెచ్-1బీ సహా బీ1/బీ2 వంటి నాన్‌ఇమిగ్రెంట్ వీసాదారుల దరఖాస్తులపై తీవ్ర ప్రభావం పడనుంది. వీరు వీసా రెన్యువల్ కోసం సుదీర్ఘకాలం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఉన్న నిబంధన ప్రకారం.. గత 48 నెలల్లో వీసా గడువు ముగిసినవారు రెన్యువల్ కోసం డ్రాప్‌బాక్స్ విధానంలో దరఖాస్తు చేసుకునే వీలుండేది. అలాంటివారికి ఎలాంటి ఇంటర్వ్యూ ఉండదు. ఇప్పుడీ నిబంధనను మారుస్తూ గత 12 నెలల్లో వీసా గడువు ముగిసినవారికి మాత్రమే డ్రాప్‌బాక్స్‌లో రెన్యువల్ చేసేందుకు అనుమతి కల్పిస్తున్నారు. అంటే వీసా గడువు తీరి సంవత్సరం దాటినవారు రెన్యువల్ కోసం మళ్లీ వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలకు హాజరవ్వాల్సిందే. వాస్తవానికి కోవిడ్ ముందు వరకు ఇంటర్వ్యూ లేకుండా వీసా పునరుద్ధరణ కోసం ఈ 12 నెలల నిబంధనే అమల్లో ఉండేది. ఆ తర్వాత వీసా మంజూరు, రెన్యువల్‌కు పడుతున్న సమయాన్ని దృష్టిలో పెట్టుకొని 2022లో ఈ 'డ్రాప్‌బాక్స్' విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి గత 48 నెలల్లో గడువు పూర్తయినవారు కూడా ఇంటర్వ్యూ లేకుండా రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. ఇప్పుడు ట్రంప్ సర్కారు దీన్ని మళ్లీ పాత పద్ధతికి తీసుకొచ్చింది.

### భారతీయులపైనే అధిక ప్రభావం..

తాజా మార్పులతో భారత దరఖాస్తుదారులకు వీసా రెన్యువల్ మరింత ఆలస్యం కానుంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబయి వంటి ప్రధాన నగరాల్లో బీ1/బీ2 వంటి వీసా దరఖాస్తుదారులు ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్‌ల కోసం 440 రోజులకు పైగా నిరీక్షిస్తున్నారు. ఇప్పుడు మరింత ఎక్కువమంది ఇంటర్వ్యూలకు వస్తే ఈ వీసాల జారీ ఇంకా ఆలస్యం కానుంది. డ్రాప్‌బాక్స్‌పై ఆధారపడుతున్న బిజినెస్ ట్రావెలర్స్, వృత్తినిపుణులు వీసాల (హెచ్-1బీ) పునరుద్ధరణకు ఇంటర్వ్యూ స్లాట్ల కోసం ఎదురుచూడాల్సివస్తుంది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.